వనమహోత్సవానికి సిద్ధం

● 39 నర్సరీల్లో మొక్కల పెంపకం

నెక్కొండ : కనుమరుగవుతున్న అడవులు, పెరుగుతున్న కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ తరుణంలో ప్రభుత్వం వనమహోత్సవ పథకాం అమలుకు శ్రీకారం చుట్టింది. ఏటా వేసవిలో నర్సరీల్లో మొక్కలు పెంచి వర్షాకాలంలో పల్లెల్లో నాటించి పచ్చదనం పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. మండలంలో వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇప్పటికే మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఒక్కో నర్సరీలో 10 వేల మొక్కల చొప్పున 3.90 లక్షల మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. మండలవ్యాప్తంగా 39 నర్సరీల్లో మొక్కల పెంపకం చురుగ్గా సాగుతోంది. ఈ ఏడాది 70–80 రకాల పూల, పండ్ల, నీడనిచ్చే మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రణాళికలు సిద్ధం

వనమహోత్సవంలో భాగంగా ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండవేడిమి నుంచి సంరక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సరీలకు షెడ్‌నెట్స్ ఏర్పాటు చేయడంతోపాటు రోజుకు రెండు సార్లు నీరు అందిస్తున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు నర్సరీలను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. విద్యా సంస్థలు, వసతిగృహాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

నర్సరీల్లో పెంపకం ఇలా..

మండలంలోని 39 పంచాయతీల్లోని నర్సరీల్లో ఉపాధి హామీ పథకం కింద మొక్కల పెంపకం చేపట్టాము. ఒక్కో పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీ ఏర్పాటు చేసి సుమారు 10 వేల మొక్కలు చొప్పున పెంచే దిశగా కార్యాచరణ చేపడుతున్నారు. ఒక్కో నర్సరీకి సుమారు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. నర్సరీల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు.


అప్పల్‌రావుపేట నర్సరీలో మొక్కలకు నీరందిస్తున్న సిబ్బంది


పెద్దకొర్పోలు నర్సరీని పరిశీలిస్తున్న టీఏ కవిత

ప్రతిమొక్కనూ సంరక్షిస్తాం



వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిలు రూపొందించాం. మండలంలోని 39 నర్సరీల్లో 3.90 లక్షల మొక్కలు పెంచుతున్నాం. ప్రతిమొక్కనూ సంరక్షించేలా చర్యలు చేపడుతున్నాం. వనమహోత్సవం నాటికి నర్సరీల్లోని అన్ని మొక్కలను అందుబాటులో ఉంచుతాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వన మహోత్సవ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం.

– ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

క్లుప్తంగా

పునీత రాయప్ప బోధన పీఠ వేడుక



చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయిని పహాడ్‌లో ఫాదర్ తుమ్మ యాగారెడ్డి ఆధ్వర్యంలో పునీత రాయప్ప బోధన పీఠ గ్రామ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలందరిపైనా యేసుక్రీస్తు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. సాయంత్రం గ్రామంలో యేసుక్రీస్తు ప్రతిమను ఊరేగించారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటి చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, గుడి పెద్దలు నరిశెట్టి రాజు, కొండవీటి ప్రదీప్‌కుమార్, పుట్టి భాస్కర్, కస్పరాజు, నాగోతు జోజి, పుట్టి శౌరిరాజు, ఇన్నయ్య, బాలస్వామి, జయరాజు, దేవదానయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో ఆర్నెళ్ల పదవీ కాలం పెరిగిన క్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్ గౌడ్‌ను రైతులు, గ్రామస్తులు శనివారం సన్మానించారు. తొలుత మనోజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జడల కృష్ణ, షబీర్, జనగాం లక్ష్మణ్, బాషా, అమ్జద్, బొంత సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

‘యూరియా కొరత లేదు’

ఖానాపురం : మండలంలో యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల రైతులకు అందించేందుకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు సహకార సంఘాలతోపాటు ఓడీసీఎంఎస్, ఆగ్రోస్ కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల డీలర్ల ద్వారా రైతులకు 38 వేల 288 బస్తాల యూరియా అందించినట్లు వివరించారు. పంటలు పూర్తి అయ్యే వరకు రైతులకు ఇవ్వడానికి యూరియా నిల్వలున్నాయని స్పష్టం చేశారు. రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు.

నేడు సైనిక్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ఖానాపురం : మండలంలోని గిరిజన సైనిక్ స్కూల్‌లో నేడు (ఆదివారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గురుకుల ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరంలో 5 నుంచి 9వ తరగతుల వరకు ప్రవేశాలు కల్పించడానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు స్కూల్‌కు చేరుకోవాలని సూచించారు. నర్సంపేట నుంచి పాకాల మార్గంలో సుమారు 7 కిలోమీటర్ల దూరంలో స్కూల్ ఉంటుందని వివరించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గొడుగుల పంపిణీ



వర్ధన్నపేట : పట్టణంలో ఇద్దరు కూరగాయల వ్యాపారులకు హనుమకొండకు చెందిన లయన్స్ క్లబ్ థౌజెండ్ పిల్లర్స్ ఆధ్వర్యంలో శనివారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చొప్పరి సోమయ్య మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సిలువేరు కుమారస్వామి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి అదృశ్యం


శ్రీను

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన మూగ, చెవిటి దివ్యాంగుడు అదృశ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గిరగాని శ్రీను పుట్టుకతోనే మూగ, చెవిటి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 21న సాయంత్రం మూత్ర విసర్జనకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. శ్రీను ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో టీషర్ట్, నలుపు రంగు నిక్కర్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 8712685234, 8712585025ల్లో సమాచారం అందించాలని కోరారు.

నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

నర్సంపేట : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. జిల్లాలోని పలు పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం నర్సంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవి మాట్లాడారు. ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్లని చెప్పారు. ఆయన కాకుండా ఇంకెవరు గెలిచినా అధికార పార్టీలో చేరిపోతారని తెలిపారు. అప్పుడు ఓటరు ఓడిపోయినట్లని చెప్పారు. నర్సిరెడ్డి మాత్రమే ఆరేళ్లుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్‌ప్రసాద్, నాయకులు గుండు కరుణాకర్, కె.రమేష్, ఎస్‌ఏ రవూఫ్, రాజిరెడ్డి, రాంబాబు, శ్రీకాంత్, మహేశ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం


బుర్రి సునీత


వెంది సక్కుబాయి

దుగ్గొండి : మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని మదిరకు చెందిన బుర్రి సునీత, మండల అధ్యక్షురాలిగా మల్లంపల్లికి చెందిన వెంది సక్కుబాయి నియమితులయ్యారు. ఈ మేరకు వారికి జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ శనివారం నియామక పత్రాలు అందజేశారు. అనంతరం సునీత, సక్కుబాయి మాట్లాడారు. మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీగా సుందర్‌రాజ్ గెలుపు ఖాయం


నర్సంపేట : కరపత్రాలను ప్రదర్శిస్తున్న రాజు, తదితరులు

● మెపా రాష్ట్ర కార్యదర్శి రాజు

నర్సంపేట/దుగ్గొండి : వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సుందర్‌రాజ్ యాదవ్ గెలుపు ఖాయమని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు కోరారు. బీసీ నేత డేగల శ్రీనివాస్‌తో కలిసి నర్సంపేట, దుగ్గొండి మండలాల్లో నివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాఆరు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులు ఏకం కావాలని ఆకాంక్షించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన సుందర్‌రాజ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు ఎలబోయిన కుమారస్వామి, చరక నారాయణ, పవన్, పొన్నం రాజు, పెండ్యాల కృష్ణ, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై రైతుల అధ్యయనం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని డంపింగ్ యార్డు (సెగ్రిగేషన్ షెడ్)పై జనగామ జిల్లాలోని మేకలగట్టు రైతులు శనివారం అధ్యయనం చేశారు. ప్రజ్వల్ (మారి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 మంది రైతులను వడ్లకొండ డంపింగ్ యార్డుకు తీసుకొచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సునీల్ రైతులకు ఇళ్ల నుంచి సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసే విధానంపై వివరించారు. పొడి చెత్త విక్రయిస్తూ గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చడాన్ని అర్థం చేయించారు. కార్యక్రమంలో హిమవర్షిని ప్రాజెక్టు యూనిట్ మేనేజర్ మూడు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రైలు దిగుతుండగా యువకుడికి గాయాలు

నెక్కొండ : రైలు దిగుతుండగా యువకుడికి గాయాలైన ఘన మండల కేంద్రంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని రామన్నపేటకు చెందిన వోడపెల్లి పవన్‌కుమార్ ఉదయం కృష్ణా ఎక్స్‌ప్రెస్ దిగుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన పవన్‌కుమార్‌ను 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఫార్మసీ కళాశాలలో వేడుక

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఫార్మా–డీ కళాశాలలో శనివారం ఘనంగా వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు పరిశోధనపైనా ప్రత్యేక దృష్టికి సారించాలని సూచించారు. వ్యాధులపై సమగ్ర విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, వివిధ విభాగాధిపతులు డాక్టర్ మనీశ్, డాక్టర్ రవి, నగేశ్, రవి, రమణ, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

● ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

వర్ధన్నపేట : విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సుమారు రూ.8125 కోట్లకుపైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉందన్నారు. అధికారంలోకి రాగానే చెల్లిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కి 15 నెలలు దాటినా విడుదల చేయకపోవడం సరికాదన్నారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ చేసి, ధర్నా నిర్వహించగా నామమాత్రంగా కొంత చెల్లించిందని గుర్తు చేశారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, రాజ్‌కుమార్, సురేశ్, రంజిత్, అక్షయ్, అఖిల్, మణిసాయి, సుజిత్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై కేసు నమోదు చేయండి

● ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్

వర్ధన్నపేట : పర్వతగిరి మండలంలోని అన్నారం యాకూబ్ షావలీ బాబా దర్గాలో భక్తులు సమర్పించిన తలనీలాలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన, కొనుగోలు చేసిన అక్రమార్కులపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలని ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లం దాసు కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డును మోసగించేలా రూ.60 లక్షల విలువైన తలనీలాలు మాయం చేసిన ఘటన వెలుగులోకి వచ్చాక జిల్లా కలెక్టర్ విచారణాధికారిని నియమించినా ఇప్పటివరకు నిందితులను గుర్తించకుండా కాలయాపన చేస్తుండడం అనుమానాలు తావిస్తోందన్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులను వెంటనే గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు షూ పంపిణీ



నెక్కొండ : మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ శాఖ డీఈ చల్లా రఘోత్తంరెడ్డి సమకూర్చిన షూ, సాక్స్‌లను ఎంఈఓ రత్నమాల శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన అందుతోందని తెలిపారు. విద్యార్థులకు షూ, సాక్స్ అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రంగారావు, జాన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ రచయిత శిల్పా జగదీష్ (ములుక సాంబయ్య) శనివారం పరీక్ష సామగ్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు రవి, ఉమాదేవి, రజని, అనుపమ, శ్రీనివాస్‌రెడ్డి, కౌసర్, మంజుల, రాజశేఖర్, సునీల్, పద్మ, ఫౌండేషన్ సభ్యులు సిద్దకుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్‌ఆర్‌ఆర్’ చేయూత

రాయపర్తి : ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మండలంలోని పలు కుటుంబాలకు చేయూత అందించారు. తొలుత మైలారంలో జక్కుల కొమురయ్య మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.5 వేల సాయం అందించారు. అనంతరం కొత్తూరులో ఇటీవల మృతి చెందిన కందికట్ల యాకమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. కొండూరులో మాజీ ఎంపీటీసీ చిర్ర ఉపేంద్ర వెంకన్న దంపతుల కుమారుడు నితిన్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు బియ్యం, ఆయిల్ క్యాన్ సాయంగా అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, నాయకులు కందికట్ల స్వామి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, కోల సంపత్, గజవెల్లి ప్రసాద్, గబ్బెట యాకయ్య, గూడెల్లి వెంకటయ్య, బాద రవి, తాటికాయల భాస్కర్, పాలెపు శ్రీనివాస్, రామకృష్ణ, జనగం సురేష్, రామస్వామి, సాయిమల్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

● న్యాయవాదులు రజని, సునీత


మాట్లాడుతున్న న్యాయవాది రజని

నర్సంపేట : సమాజంలోని ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ప్రముఖ న్యాయవాదులు రజని, సునీత తెలిపారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. రాజ్యాంగం బాలలకు, సమాజంలోని ప్రతిఒక్కరికీ హక్కులు కల్పించడంతోపాటు వాటి పరిరక్షణ కోసం చట్టాలను అమల్లోకి తెచ్చిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. బాలికల రక్షణ కోసం పలు ప్రత్యేక చట్టాలున్నాయని వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీపాల, కళాశాల కోఆర్డినేటర్ కల్పనాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్‌లో..

పర్వతగిరి : సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్సై ప్రవీణ్‌కుమార్, ట్రైనీ ఎస్సై కల్యాణ్ అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు చోటు చేసుకునే తీరుపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ‘జిజ్ఞాస’కు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పోషయ్య, తదితరులు

● ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజేశ్, రజిత,, శ్వేత, పవిత్ర, శివాజీ, కల్యాణ్, రజిత, అర్చన, వసంత్ కుమార్ రాష్ట్ర స్థాయి జిజ్ఞాస ప్రాజెక్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శనలపై కృషి, పట్టుదలతో సత్ఫలితాలు సాధించి కళాశాల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. జిజ్ఞాస కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్థశాస్త్ర విభాగం నుంచి సుకన్య సమృద్ధి యోజన పథకంపై కళాశాల విద్యార్థులు అధ్యయనం చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులకు అర్థ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజు, ‘తెలంగాణలో జైనమత క్షేత్రాలు–అగ్గలయ్య గుట్ట–చారిత్రక పరిశీలన’పై ఎంపికయ్యేలా డాక్టర్ రెడ్డప్ప మార్గదర్శకం చేశారని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ విష్ణుకుమార్, డాక్టర్ రజిత, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ స్నేహలతరెడ్డి, సంపత్‌రెడ్డి, సంధ్య, శ్వేత, సుధారాణి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు

● ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందించే దిశగా చర్యలు చేపడతామని ఎంపీడీఓ నర్సింహమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ రవితో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా తాగునీటి సరఫరాలోని సమస్యలపై ఎంపీడీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. రానున్న వేసవిలో మండల ప్రజలకు తాగునీరు అందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


వర్ధన్నపేట : హెచ్‌ఎం రమేశ్‌బాబు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. డీఈఓగా మాడుగుల అభిరామ్, ప్రధానోపాధ్యాయుడిగా మాలోతు యాకూబ్, ఆర్జేడీగా ఆశ్రిత, ఉపాధ్యాయులుగా చరణ్‌తేజ్, రాజేశ్వర్, ధనుషా, హిమాన్షు, వెంకన్న, మూడు అఖిల్, భానోతు ఉదయశ్రీ, దివ్య, బాబు, మణికంఠ వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పాక రమేష్‌బాబు మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసే దిశగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీధర్, న్యాయ నిర్ణేతలుగా మనోహర్, శాంతికిరణ్, పరశురాములు, రాధాకృష్ణ, కుమారి, డి.కుమార్, వెంకన్న, రేఖ, రమేష్, బాబు, రాజ్యలక్ష్మి, తదితరులు వ్యవహరించారు.

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలిగా రశ్మిత, డీఈఓగా నాగరాజు, ఎంఈఓగా యశ్వంత్, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకర్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు మధుసూదన్, శ్రీనివాస్, గీత, సుమలత, సుధీర్‌కుమార్, కమల, గంగాధర్, వీణజ్యోతి, వెంకన్న, ప్రదీప్, సీఆర్పీలు అరుణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవ వేడుక నిర్వహించారు. పలువురు విద్యార్థులు తరగతులు బోధించారు. ఎంఈఓగా నాగరాజు, ప్రిన్సిపాల్‌గా ప్రభాస్, వైస్ ప్రిన్సిపాల్‌గా అంజలి, ఉపాధ్యాయులుగా ఈశ్వర్, చరణ్, కీర్తి, వర్షిత వ్యవహరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ చల్లా యాకూబ్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, లావణ్య, దేవేందర్, నందు, రమ్య, రాణి, యామిని, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ రెడ్డిలను ఇటీవల వారి మాతృమూర్తి జయశ్రీ మృతి చెందిన నేపథ్యంలో ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అరుణ శనివారం పరామర్శించారు. తొలుత ఆమె మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, విజయచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చిర్ర ఉపేంద్ర–వెంకన్న దంపతుల కుమారుడు నితిన్ శనివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గిరగాని రాజు, తదితరులు పాల్గొన్నారు.